క్లుప్తంగా

ఘనంగా దుర్గాదేవి హోమం



పూజలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో వెలిసిన కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అంగరంగ వైభవంగా హోమాన్ని వేద పండితుడు భమిడిపాటి రంగబాబు అధ్వర్యంలో నిర్వహించారు. అలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో వందలాది మంది భక్తులు హాజరై పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

సావిత్రమ్మ మృతి తీరని లోటు



సావిత్రమ్మ మృతదేహం వద్ద సీపీఎం నాయకుల నివాళి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీపీఎం వీరాభిమాని సావిత్రమ్మ మృతి పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగర సమీపంలో నవభారత్‌నగర్‌లో శనివారం అశ్రునయనాల మధ్య సావిత్రమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్, లోకనాథం, జిల్లా కార్యదర్శి గోవిందరావు హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పది మంది బాగు కోసం ఆలోచించే గొప్ప సంకల్పం గల వ్యక్తి సావిత్రమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో పెద్ద కుమారుడు, పోస్టల్ యూనియన్ నాయకులు జ్యోతీశ్వరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి అవార్డు



మంత్రి వెంకటస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన సంఘ సేవకుడు మంత్రి వెంకటస్వామికి ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్ట్రో మెడికల్ జెమాలజిస్టుగా నాలుగు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ బృందం ఈ అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణ



పారాయణ చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిరంలో దివ్య జీవన సంఘం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణ శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణ, లక్ష్మీ అష్టోత్తర పారాయణర, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషిచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: గ్రామీణ క్రీడగా గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ కలిగిన బాల్ బ్యాడ్మింటన్ గేమ్‌కు జాతీయ స్థాయి హోదా పునరుద్ధరణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు కోరారు. ఈ మేరకు శనివారం విజయవాడలో మంత్రి కె.అచ్చెన్నాయుడు నివాసంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిశారు. బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జాతీయస్థాయిలో రాణించిన వందలాది మంది క్రీడాకారుల భవిష్యత్తు.. హోదా పునరుద్ధరణ అంశంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. పార్లమెంటులో క్రీడాకారుల తరపున గలం వినిపించాలని,కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, కోచ్ ఎం.మధుసూదన్‌రావు, మక్క రమేష్, మజ్జి చిన్నికృష్ణ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీ(మేజర్), బీఏ రాజనీతి శాస్త్రం(మేజర్) మొదలైన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశాలమైన ఆటస్థలం, విద్యార్థులకు లైబ్రరీ సదుపాయం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

• వేంకటేశ్వర వైభవం



చిన్నబజారులో పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు



మొండేటివీధిలో ఉన్న వేంకటేశ్వరునికి పూజలు



డీసీసీబీ కాలనీలో వేంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. స్వామికి పూలు, తులసిమాలలతో అలంకరించారు.

● మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

● నగరంలోని డీసీసీబీ కాలనీలో భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ కల్యాణ ఉత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 25న గరుడ ధ్వజ ప్రతిష్ఠ, హోమాలు, సాయంత్రం కల్యాణం, 26న మండపారాధన, తీర్థగోష్ఠి, అన్న సమారాధన, 28న మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్రస్నానం, పుష్పయాగ మహోత్సవం జరుగుతాయని వివరించారు. శనివారం ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఆలయ ధర్మకర్త సన్యాసిరావు, సభ్యులు బిర్లంగి రామ్మోహనరావు కోరారు.

పరామర్శ



ఎచ్చెర్ల క్యాంపస్: మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్



రణస్థలం: అసిరినాయుడు కుమారుడిని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్



జి.సిగడాం: రామారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల కన్నంనాయుడు తండ్రి అసిరినాయుడు ఇటీవల మృతి చెందారు. అలాగే పెనసాం గ్రామానికి చెందిన గేదెల రామారావు కుమారుడు గేదెల రమణ ఇటీవల చెట్టుమీద నుంచి పడి మృతి చెందారు. సమాచారం తెలుసుకుని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం ఈ రెండు గ్రామాల్లో ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల బూత్ కమిటీ కన్వీనర్ అబోతుల జగన్నాథం, నాయకులు డోల వెంకటరమణ, బూటు అప్పారావు, పల్లేడ సన్యాసిరావు, ఇప్పిలి త్రినాథరావు, కుదిరెళ్ల గోవిందరావు తదితరులు ఉన్నారు.

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన లంక అసిరినాయుడు కుమారుడు అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతడిని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించి, త్వరగా కోలుకోవాలని అకాక్షించారు. అలాగే తెప్పలవలస పంచాయతీలోని నీలంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దుంగ చినరాముడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో నాయకులు బొమ్మలాట శ్రీరాములు, దన్నాన హరి తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఈనెల 18వ తేదీన కుప్పిలి గ్రామంలో అసిరితల్లి ఉత్సవాల్లో భాగంగా సిరమాను ఊరేగింపు సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో బుడగుట్లపాలేంకు చెందిన సూరాడ అప్పన్న, కారి పల్లేటి మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఆయా కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ప్రభుత్వం కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు నాయకులు బల్లాడ వెంకటప్పారావు రెడ్డి, అంబటి రాంబాబు, దన్నాన హరి, వాసుపల్లి అప్పారావు ఉన్నారు.

'కార్మికుల వేతనాలు పెంచాలి'

రణస్థలం: అరబిందో (ఏపీటోరియా) ఫార్మా కార్మికుల చాప్టర్ ఆఫ్ డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమలో ఐదేళ్లకు పైబడి పని చేస్తున్న కార్మికులను రెగ్యూలర్ చేయాలని, అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలిలో జరిగిన సిరిమాను ఉత్సవాల్లో చోటుచేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన బుడగుట్లపాలేం అప్పన్న, పల్లేటి కుటుంబాలను ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి డాక్టర్ విశ్వక్‌సేన్ శనివారం పరామర్శించారు. దీనిలో భాగంగా కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

'కొత్త నేర చట్టాల అమలు ఆపాలి'

ఆమదాలవలస: దేశంలో జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్న కొత్త నేర చట్టాల అమలును ఆపాలని ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు కేంద్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872, భారతీయ నేర విధాన స్మృతి 1973 రద్దు కానున్నాయని పేర్కొన్నారు. వాటి స్థానంలో భారతీయ నాగారిక్ సురక్ష సంహిత 2023, భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ సాక్ష్య అదినియం 2023 అనే మూడు కొత్త నేర చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఈ కొత్త చట్టాల్లోని పలు నిబంధనల రాజ్యాంగ బద్దతపై అనేక రకాల న్యాయ సంశయాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ చట్టాల్లో సవరణలు చాలా వరకు క్రూరమైన స్వభావం కలిగినవిగా ఉన్నాయని, ఇవి మన ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడానికి, భారత్‌ను ఫాసిస్టు రాజ్యంగా మార్చడానికి ప్రభుత్వానికి శక్తిని ఇస్తాయని భావిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర పరిశోధన సంస్థలు, పార్లమెంట్, న్యాయ నిపుణులు, మేధావులు అధ్యయనం చేసి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. అందువలన ప్రస్తుతానికి కొత్త నేర చట్టాల అమలు ఆపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.


వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న ఎంఈవో మాధవరావు

జలుమూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మండల విద్యాశాఖ అధికారి బి.మాధవరావు సూచించారు. మండలంలోని మహ్మద్‌పురం ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమయపాలనతోపాటు రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందించాలని సూచించారు.

స్టూడెంట్ కిట్లు అందజేత



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ విద్యాలయంలో విద్యార్థులకు టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, తెలుగు యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్లు శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు హనుమంతు గోపి పాల్గొన్నారు.

12న పేద కళాకారులకు సరుకుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న కళాకారుల సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: నిరుపేద కళాకారుల కోసం జూలై 12న బాలసుబ్రహ్మణ్యం స్వరనీరాజ కార్యక్రమం జరుగుతుందని, అందులో భాగంగా పేద కళాకారులకు నిత్యావసర సరుకుల పంపిణీ ఉంటుందని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మిమిక్రీ శివ, అధికార ప్రతినిధి కూన అనిల్ తెలిపారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలలుగా కార్యక్రమాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కళాకారులను ఆదుకోవాలనే ఉద్దేశంతో 150 మంది ఎంపిక చేసిన కళాకారులకు సరుకులు అందించనున్నట్లు వెల్లడించారు. సంఘం ఏర్పాటైన ఐదేళ్ల నుంచి పేద కళాకారులను ఆదుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు స్వప్న శ్రీను, కార్యదర్శి రాము, గౌర అధ్యక్షుడు సింహాద్రి శ్రీను, సహాయ కార్యదర్శి మార్గదర్శి శ్రీను, వ్యవస్థాపక అధ్యక్షుడు అరవింద్, కోశాధికారి భానుమతి, కో-ఆర్డినేటర్లు బొడ్డేపల్లి రాము, గండ్రేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



శ్రీకాకుళం కల్చరల్:రాజరాజేశ్వరిమాతకు అలంకరణ

ఎచ్చెర్ల/శ్రీకాకుళం కల్చరల్: పౌర్ణమి సందర్భంగా దేవీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎచ్చెర్ల మండలం కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం ఆశ్రమ పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి కుంకుమపూజలు చేశారు. శ్రీచక్రాలు, మహామేరువు వద్ద విశేష పూజలు జరిగాయి. లలితాపారాయణం అనంతరం అమ్మవారికి హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీకాకుళంలోని గోవిందనగర్ కాలనీలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు చరణ్‌శంకర్‌శర్మ, ధర్మకర్త మొదలవలస ఉషారాణి దంపతుల నేతృత్వంలో మూలవిరాట్టుకు పాలు పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి ఉద్యాపనలు, మహానివేదన, మహాహారతి నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. అనంతరం అమ్మవారిని పూలతో అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ సాగు లాభదాయకం



ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ పద్ధతిలో విత్తనాలు చల్లుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ పద్ధతిలో విత్తనాలను సులువుగా వెదజల్లవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ తవిటినాయుడు అన్నారు. మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విత్తనాలు చల్లే వి. ధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సమస్యను అధిగమించాలంటే యంత్రాలతో కూడిన విధానమే మేలన్నారు. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి గల ప్రదేశాల్లో లాభదాయక పంటలను పండించాలంటే యంత్రాలతోనే వరిసాగు చేయాలన్నారు. ఎకరాకు 16 కిలోల శుద్ధిచేసిన విత్తనాన్ని ఒకేసారి ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా చల్లుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కోష్టలో విత్తనాల పంపిణీ



జి.సిగడాం: ఆనందపురంలో విత్తనాలను అందిస్తున్న దృశ్యం



రణస్థలం: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: ఖరీఫ్ సీజన్‌కి సంబంధించిన వరి విత్తనాలను రైతులకు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ బి.హేమనళిని కోష్ట పంచాయతీలో శనివారం పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎంటీయూ 1121(శ్రీధృతి), సాంబా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోష్ట పంచాయతీ సర్పంచ్ పిషిణి చిన్నంనాయుడు, నాయకులు పిషిణి జగన్నాథం, ఎంపీటీసీ అసిరినాయుడు, మాజీ ఎంపీటీసీ పైడి అప్పడుదొర, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురంలో...

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. అర్హులైన రైతన్నలకు వివిధ రకాల విత్తనాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్, నాయకులు చిత్తిరి మోహన్, కంచరాన సూరన్నాయుడు, వజ్జిపత్తి రఘురాం, చిత్తిరి లక్ష్మం, చిత్తిరి సీతంనాయుడు, రమణ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాను

● మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: గ్రామస్థాయిలో ఉన్న కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడవద్దని, అందరికీ అన్నివిధాలుగా అండగా ఉంటానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నడిమివలసలో శనివారం ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో మన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సహకరించారన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమి సాహజమేనని పేర్కొన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి మంచి బలం ఉందని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రతీ ఒక్క కార్యకర్త సమన్వయంలో ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశామనే విషయం గుర్తు చేశారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల బూత్ కమిటీ కన్వీనర్ అబోతుల జగన్నాథం, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● డ్వామా పీడీ చిట్టిరాజు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ చిట్టిరాజు సూచించారు. లావేరు మండలంలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను చేపడుతున్న కూలీలు రోజుకు రూ.300 వేతనం వచ్చేటట్లు పని చేయాలని కోరారు. ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అనంతరం ఉపాధి నిధులతో అనుసంధానం కలిగిన నాడు-నేడు స్కూల్ ప్రహరీ, సచివాలయం సీసీ డ్రైనేజీలు పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీవో సత్యవతి, సిబ్బంది ఉన్నారు.

జగన్నాథునికి జ్యేష్టమాస పూజలు



గుజరాతిపేటలో జగన్నాథస్వామికి పూజలు



బొందిలీపురంలో జగన్నాథునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు జగన్నాథ స్వామి దేవాలయాలలో స్వామివారికి జ్యేష్ఠమాస పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుజరాతీపేట జగన్నాథస్వామి దేవాలయంలో పెంట వంశానికి చెందిన అర్చకులు జగన్నాథునికి విశేష పూజలు చేశారు. స్వామివారు నిద్రలోకి వెళ్లి మళ్లీ ఆషాఢమాసంలో రథయాత్ర ఉత్సవాల సమయంలో మేల్కొంటారని తెలిపారు. బొందిలీపురం జగన్నాథస్వామి ఆలయంలోనూ పూరీ తరహాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు



జలుమూరు: యంత్రంతో విత్తనాలు వేస్తున్న దృశ్యం

జలుమూరు: వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ అన్నారు. మండల పరిధి లింగాలవలస, యలమంచిలి గ్రామాల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యంత్రాలతో ఒకేసారి విత్తనాలు, ఎరువులు వేసే పద్ధతి(ఫెర్టీ కమ్ సీడ్ డ్రిల్)పై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో నీటి లభ్యత ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా సాంకేతిక, యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఎకరాకు కేవలం 16 కిలోల శుద్ధి చేసిన విత్తనాలు చదును చేసిన పొలంలో చల్లుకోవాలన్నారు. విత్తనం ఎక్కువ లోతులో వేస్తే మొలక శాతం దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. అందువలన నేలపై 2.5 నుంచి 5 సెంటీమీటర్లు లోతులో విత్తనం పడేటట్లు మొక్కకు మొక్కకు కనీసం పది సెంటీమీటర్లు దూరం ఉండాలన్నారు. దీనివలన గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల నివారణ, కలుపు తీయడం, ఎరువులు వేసుకోవడం సులువుగా ఉంటుందన్నారు. రైతులు విత్తనాలు వేసే ముందు పది గ్రాముల సూడోమోనస్ కేజీకి చొప్పున కలిపి చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త కె.ధర్మారావు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణతో మేలు

సరుబుజ్జిలి: వ్యవసాయంలో యాంత్రీకరణతో మేలు జరుగుతుందని రెడ్డీస్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అత్తులూరి లావణ్య అన్నారు. మండలంలోని వెన్నెలవలస గ్రామంలో ఫెర్టీ కమ్ సీడ్ డ్రిల్ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త బి.రాజ్‌కుమార్, రైతు మిత్రలు మజ్జి రామకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల కదలికలపై నిఘా



ఆల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పాతపట్నం: పట్టణంలో వాహన కదలికలు, అనుమానితులపై నిఘా వేసినట్లు సీఐ నల్లి సాయి తెలియజేశారు. ఇటీవల జాతీయ రహదారి పనుల్లో భాగంగా పనిచేయకపోయిన సీసీ కెమేరాలను మరలా పునరుద్ధరించినట్లు వెల్లడించారు. జాతీయ రహదారిలో అమ్మవారి ఆలయం సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పనులు చేపడుతున్నప్పటికీ అక్కడ ఉన్న కెమేరాలు పనిచేస్తున్నాయన్నారు. ఆల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో మూడు కెమేరాలు, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం జంక్షన్‌లో మూడు కెమేరాలు, పోలీసు స్టేషన్ వద్ద మూడు కెమేరాలు ఏర్పాటు చేశారు. అలాగే దువ్వారివీధికి ఎదురుగా ఒకటి, సెయింటెన్స్ స్కూల్ వద్ద ఒకటి, రాష్ట్ర సరిహద్దులో కెమేరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల మార్గంతో పాటు ఒడిశా, మెళియాపుట్టి, టెక్కలి, శ్రీకాకుళం మార్గంవైపు కూడా నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిక్షిప్తమైన సమాచారం నేరుగా సర్కిల్ కార్యాలయంకు, జిల్లా ఎస్పీ కార్యాలయం కమోండ్ కంట్రోల్ రూమ్‌లకు కనిపించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.